# ఆలంబన

కన్నెగంటి చంద్రశేఖర రావు



సరిగ్గా, పన్నెండుగంటల ముప్పయితొమ్మిది నిముషాలకు, అంటే మరో పదహారు నిముషాలకు కృష్ణా ఎక్స్‌ప్రెస్ గుంటూరు రెండో నెంబరు ప్లాట్‌ఫారం మీదికి రావలసి వుందనగా ఓ అమ్మాయి నన్ను ఢీకొట్టింది కాక నేనే ఆ అమ్మాయిని ఢీకొట్టి వుండొచ్చు అలా ఢీకొట్టిందాకా నేనా అమ్మాయిని చూడలేదు టైము చూడడానికి తలకాయొంచకపోతే ఆ అమ్మాయి స్పర్శ ఎంత బావుంటుందనుకున్నా మనసు మూలల్లో వున్న సహజమైన పిరికితనంవల్ల ఛాన్ష్ యివ్వడానికి వీలుండేదికాదు దానివల్ల ఏమంత ప్రమాదమూ జరగలేదు మెత్తగా తగిలిన స్పర్శ .. ఒంటికి ఒత్తుకున్న వెచ్చటి స్పర్శ ఝల్లుమనిపించి ఆ యోమయంలో ముంచేలోగా పాతికేళ్ళు ఒంటబట్టిన నాగరికత థాంక్స్ బదులు చటుక్కున సారీ చెప్పేసింది ఎదురొచ్చిన సారీని గమనించకుండానే.

కాస్త తేరుకున్నాక తిరిగి చూస్తే ఆ అమ్మాయి తలను కొద్దిగా ప్రక్కకుతిప్పి ఇంకో అమ్మాయితో మాట్లాడుతుంది, మెల్లగా నడుస్తూనే బహుశా ఇద్దరూ ఫ్రెండ్సయి వుండొచ్చు. ఇద్దరి భుజాలనా వున్న ఎయిర్ బాగ్‌లను బట్టి వాళ్ళూ ప్రయాణానికేననిపించింది ఆ అమ్మాయి నల్లచీరా, జాకెట్టూ కనిపించాయి కాని, ప్రక్కనున్న అమ్మాయిని సరిగ్గా చూడబోయేలోగా, కళ్ళకెవరో అడ్డమొచ్చారు మొత్తాని కిద్దరూ బ్రహ్మచారి కళ్ళకు మంచి సౌష్టవాకారాలుగా అనిపించారు. ఆ గాభరాలో వాళ్ళ మొహాలే సరిగా చూళ్ళేదుకాని, మళ్ళీ వాళ్ళ వెంట పరుగెత్తుకువెళ్తూ పరధ్యానంలో మళ్ళీ ఏ అమ్మాయికో కాక ఏ మగవెధవనో ముసలమ్మనో గుద్దుకుంటే వచ్చే పాట్ల గురించి విచారించి, ట్రెయినెక్కాక ఎక్కడికీ తప్పించుకు వెళ్ళలేరని తృప్తిపడి మెల్లగా హిగ్గిన్‌బాథమ్ వేపు వెళ్ళి అన్ని పత్రికల అట్టమీది బొమ్మలూ, లోపలి బొమ్మలూ పరిశీలించి, తెలుగు వీక్లీ ఒకటి కొనుక్కుని బాగ్‌లో ఇరికించి, ప్లాట్‌ఫాం మీది కొచ్చేసరికి, తన జీవితంలో పదోసారో ఏమో ఖచ్చితమైన టైంకే వచ్చేసింది కృష్ణా ఎక్స్‌ప్రెస్ రామా కృష్ణా అనుకుంటూ రాక్షసుడిలా.

మామూలుగానే రెండుక్షణాల్లో గందరగోళం. ఎక్కేవాళ్ళూ, దిగేవాళ్ళూ, పరుగులుతీసే చీరలూ పాంట్లూ, ఎయిర్‌బ్యాగ్‌లూ, సూట్‌కేసులూ కంపార్టుమెంటు నంబర్లూ, సీటు నంబర్లూ ...

సరిగ్గా విశ్రాంతేనా తీసుకోకుండా పావుగంటలోనే బయలుదేరింది కృష్ణా పదిమంది కూర్చోవలసిన ఆ ఎదురెదురు జంట సీట్లకు నేనొక్కణ్ణే అయ్యేను ప్రక్కనున్న సింగిల్ సీట్లలో ఒకదాన్లో పొట్టిగావుండి పొట్టవేసుకొని ఒకాయన కూర్చున్నాడు ఆయన కెదురుగా ఆయనలాగే జుట్టునెరిసినా ఎత్తైనపొట్టలేకుండా, పొడుగ్గా వున్నాయన కూర్చునివున్నాడు

ఆ పది సీట్లకు ఏకచ్ఛత్రాధిపత్యం వహించాల్సి ఎచ్చినందుకు సంతోషించడమో, విచారించడమో తేలకముందే ఇందాక చూసిన అమ్మాయిలిద్దరూ అక్కడివాకా వచ్చి ఆగారు సీటు నంబర్లు చూస్తూ వాళ్ళే నన్ను వెతుక్కురావడం చూసి ఏదో సామెత గుర్తొరాబోయింది కాని వెంటనే ఆగిపోయింది, ఆ అమ్మాయి "ఇది ఆరో నెంబరు కంపార్టుమెంటే గదండి" అని అడగడంతో

"అవును" అని చెప్పేసేను నిజమే, ఎప్పుడూ నిజం చెప్పే హరిశ్చంద్రుణ్ణి కాకపోయినా

నా ఎదుటసీట్లోనే కూర్చున్నారువాళ్ళిద్దరూ. బహుశా కంపార్టుమెంటు నంబరు ప్లేట్స్ మార్చే ముందే ఎక్కేసి ఉండొచ్చు వాళ్ళు మళ్ళీ గుర్తురాని సామెత గురించి ఆలోచించడానికి ప్రయత్నిస్తూ, కిటికీ వేపు తల త్రిప్పి ఓరకంట వాళ్ళను పరిశీలించడంలో మునిగిపోయాను ఆ విషయమే మరిచిపోయి

ఇందాక కనపడని రెండో అమ్మాయి పీరరంగు

పసుపుపచ్చ అనీ, దాని మీద ఎరుపురంగు పూలు ప్రింట్ చేయబడిఉన్నాయనీ, పసుపురంగుజాకెట్టే వేసింది అనిన్నీ, ఆమె ఛామనఛాయ దేహానికి ఆ రంగు నప్పిందనిన్నూ నా కళ్ళు గ్రహించేయి నన్ను గుద్దిన పిల్ల ఎర్రగానే ఉండి నుదుటిమీద కుంకుమ బొట్టు పెట్టుకునుంది, రెండో అమ్మాయిలాకాక. ఇద్దరూ సన్నటి నెక్లెస్‌లు వేసుకున్నారు. ఇద్దరికీ చెరో ఇరవయ్యేళ్ళుండొచ్చు. ఇద్దర్లో ఎవరికీ పెళ్ళయ్యుండదని గట్టిగా చెప్పొచ్చు. కావ్య కన్యలంత బ్రహ్మాండమైన సౌందర్యవతులు కాకున్నా కళ్ళు తిప్పుకోలేనంత అందం కనిపిస్తూంది కాబట్టే, వాళ్ళు పెళ్ళి కాక పోవడానికి అందవిహీనత కారణం కాదనీ చెప్పొచ్చు, కాని మరెవరితో చెప్పాలో తెలీక నాకు నేనే లోపల చెప్పేసుకున్నాను

బ్యాగ్‌లో నుండి వీక్లీ తీసి చదవడం మొదలు పెట్టాను మధ్య మధ్య అటుకేసి చూపులు పోవడంవల్ల అంత ఫాస్ట్‌గా చదవలేకపోయాను ఇద్దర్లో ఎవరన్నా వీక్లీని అడక్కపోరనకున్నా కాని ఎవరూ అడిగేట్టు లేరు నా అంతట నేనే పలక రిద్దామనుకుంటే ఏదో పిరికితనమో సిగ్గో అడ్డొస్తూంది. మరంచేత అంతకుముందులాగే నోర్మూసుకుని, పొట్టాయనా, పొడుగాయనా ఏంచేస్తున్నారో చూద్దామని తల తిప్పాను ఇద్దరూ ఏవో మాట్లాడుకుంటూ ఉన్నారు.

అమ్మాయిలూ ఏదోమాట్లాడుకుంటున్నారు నేనిక సీరియస్‌గా సీరియల్లో తల ముంచేశాను

ట్రెయిన్ ధన్‌ధన్ మంటూ కృష్ణాబ్యారేజి దాటి విజయవాడ స్టేషన్‌లో ఆగింది. దిగి టీ తాగి మళ్ళీ ఎక్కాను నా పక్క సీట్లో చూడగానే పెద్ద ఉద్యోగి అనిపించే ఆరడుగుల పర్సనాల్టీ హిప్పీ క్రాఫ్‌తో ఫుల్‌హాండ్స్ షర్టు టక్ చేసు కున్న, షూస్ వేసుకున్నతను కూర్చుని ఉన్నాడు. నేనలా కూర్చున్నానో లేదో ఎక్స్‌ప్రెస్ బయల్దేరింది.

అలా కూర్చున్నవాడు మామూలుగా కూర్చుంటేగా! జేబులో నుండి సిగరెట్ తీసి వెలిగించేడు. ఒక దమ్ములాగి "ఎనీ అబ్జెక్షన్" అని అడిగేడు సిగరెట్ ఒక చేత్తో పట్టుకుని పొగ వదులుతూ. అయితే అలా అడిగింది నన్నుకాదు ఆ అమ్మాయిలను ... అందుకే నాక్కొద్దిగా కోపం వచ్చింది నా అభ్యంతరంతో అతనికి పనిలేదా అనుకున్నాను అయినా సిగరెట్ కాల్చి, పొగ మొహంమీది కొదిలి 'ఏమన్నా అభ్యంతరమా' అని అడిగితే, సభ్యనాగరికులు మొహమాటం లేకుండా 'అవున్నాకది పడదు ఆర్పి మరీ అవతల పడేయండి' అని చెప్పగల్రా !

మీది కొచ్చిన పొగకు ఉక్కిరిబిక్కిరి అవుతూనో మరి కాదన్నట్లుగానో అడ్డంగా తలూపుతూ "నో అబ్జెక్షన్" అంది నల్ల చీరమ్మాయి. పసుపుచీరమ్మాయి షాపులోని కొనలేని ఖరీదైన చీరని చూసినట్టుగానో లేక లోక భయంలేని నూమాగుమీసాల కుర్రాళ్ళు ఎగ్జిబిషన్‌లో గుడ్డల్లేని ఆడ చిత్రాన్ని చూసినట్లుగానో అతనివేపే చూస్తూంది.

నేను కిటికీవేపు తల తిప్పాను.

"ఎక్కడిదాకా మీరు ?"

అడిగింది నేను కాదు అతను. నన్ను కాదు వాళ్ళనే కర్తనో, కర్మనో నేనయ్యుంటే సంతోషించకపోయినా ఆ సన్నటి కోపం మాత్రం వచ్చేది కాదు వీళ్ళెక్కడిదాకా వెళ్తే ఇతని కెందుకో? ఇతనేమన్నా వాళ్ళకు టికెట్లు తీసుకోబోతున్నాడా ? ఆ అమ్మాయిలైనా మీకెందుకంటారా ? అబ్బే ...

"ఖమ్మంఅండీ" నల్లచీర.

"మరి మీరు ?" పసుపుచీర.

"నా పేరు వెంకటాచలమండీ! వరంగల్ వెళుతున్నాను. అక్కడ ఇంజనీర్‌గా పని చేస్తున్నాను మీరేం చేస్తున్నారు ?"

"గుంటూర్లో బి. ఇడి. ట్రెయినింగు తీసుకుంటున్నామండీ! ఖమ్మంలో మా ఫ్రెండ్ పెళ్ళి. నా పేరు సుమ. ఇది రజని." నల్ల చీరమ్మాయి అంది

"మంచి పేర్లు" సన్నగా నవ్వుతూ అన్నాడతను.

"థాంక్స్." పసుపుచీరమ్మాయి రజని అంది

కోపమో మరి అసూయో నాక్కొంచెం పెరిగింది. మీ ఖర్మ, మీయిష్టం ... నాకనవసరం అనుకుని కిటికీగుండా కనిపించే దూరపు కొండలూ, పచ్చటి చేలూ చూడడం మొదలెట్టాను వాళ్ల మాటలు చెవుల పడకుండా వుండడానికి గ్గాను ఇందాక గుర్తురాని సామెతగూర్చి ఆలోచించడం ప్రారంభించేను

సామెత గుర్తుకురాలేదు కాని వాళ్ల నవ్వులు పకపకమని వినిపించేయి అతనేదో జోకేసి నట్లున్నాడు "అంత కష్టపడితేకాని ఈరోజుల్లో బ్రహ్మచారిగాళ్లకు ఇళ్ళు అద్దెకు దొరకవండీ" అన్నాడు అప్పుడే అంతకష్టమూపడి విశ్రాంతి తీసుకుంటున్న పోజుపెడ్తూ

కొద్దిగా ఆగి అడిగేడు "మీరు కార్డ్స్ ఆడతారా ?"

అతనడగ్గానే ఇద్దరూ సంతోషంగా తలలూపేరు.

వాళ్ళ మొహాల్లో ఏదో ఇంద్రజాలం విచిత్రం జరిగిపోయినట్లుంది. గుంటూరు నుండి విజయవాడ వరకూ వాళ్ళ మొహాల్లో ఏదో లోప మున్నట్లు తోచిందేకాని స్పష్టంగా తెలియలేదు అంతకుముందు నిర్జీవంగా ఉన్న కళ్ళు ఇప్పుడు నవజీవనంతో తళతళలాడుతున్నాయి. మొహాల్లోకి కూడా ఏదో క్రొత్త కళ వచ్చినట్లనిపించింది

అతను కార్డ్స్ బయటికి తీశాడు.

నేను తల కిటికీ వేపు తిప్పి, నేనొదిలిన ఆఫీసులోని నా స్నేహితుల గురించీ, క్రొత్తగా జాయినవ్వాల్సిన ఆఫీసు గురించీ తలచుకుంటూ, ఊహించుకుంటూన్నాను

మళ్ళీ నవ్వులు వినిపించాయి త్రివేణీ సంగమంలా. నాకు మరికాస్త కోపం వచ్చింది అతనంటున్నాడు "అయినా మీలాంటి వాళ్ళకంత కష్టముండదులెండి! మీ అందం చూసేనా ఏ ఆఫీసరో ఎగరేసుకు పోతాడు కట్న కానుకలు లేకుండానే."

వాళ్ళుకొద్దిగా సిగ్గుపడుతూనే నవ్వుతున్నారు

అతనప్పుడే వాళ్ళతో అంత చనువుగా సరదాగా మాట్లాడడం చూస్తే నాకసూయ పుట్టింది. నా చేతకానితనం మీద కోపంవచ్చింది బహుశా నా ముఖం నల్లబడే ఉండొచ్చు.

పొట్టాయనా పొడుగాయనా ఏదో చెప్పుకుని నవ్వుకుంటున్నారు

ఎక్స్‌ప్రెస్ ఖమ్మంలో ఆగింది ఇద్ద రమ్మాయిలూ లేచారు. వాళ్ళ మొహాల్లో కొద్దిగా బాధ బయటికి కన్పిస్తూనే ఉంది

"మళ్ళీ ఎప్పుడో కలుసుకుంటాము లెండి ఇలాగే" అతను చెప్తున్నాడు వాళ్ళతోపాటే దిగి ఏదో మాట్లాడేడు

ఎక్స్‌ప్రెస్ మెల్లగా బయలుదేరింది అతనొచ్చి కూర్చున్నాడు.


"పూర్ గర్ల్స్" అతను సగం స్వగతం గానూ, సగం నాతోనూ అన్నట్లు అన్నాడు

నేనతని కేసి చూశాను

"మీరెక్కడిదాకా" అతనడిగేడు

"హైద్రాబాదు"

"జాబ్ చేస్తున్నారా ?"



# ఘడియకోసారి మార్పులు చెందే సూర్యుడు!

**సూ**ర్య గోళంలో జరిగే ప్రక్రియలు ప్రతి పదకొండు సంవత్సరాల కొకసారి మార్పు చెందుతుంటాయని శాస్త్రవేత్తలు చాల సంవత్సరాల క్రిందటనే కనుగొన్నారు. అయితే, మన భూమికి అన్నిటికన్నా దగ్గరగా వున్న యీ నక్షత్రంలోని ప్రక్రియలు సంవత్సరాల వ్యవధిలో గాక, గంట గంటకు, నిముష నిముషానికి మారుతున్నవనీ, యీ మార్పుల ప్రత్యక్ష ప్రభావం దాని పరిణామంపైనా, కాంతిపైనా వుంటున్నదనీ యీ మధ్యనే కనుగొనటం జరిగింది

సూర్యుని అంతటి భారీ పరిమాణం గల నక్షత్రం రెండు లేదా మూడు గంటల కొకసారి సంకోచ వ్యాకోచాలు పొందుతూ వుండవచ్చుననే లెక్కన యీ నిర్ధారణకు రావడం జరిగింది ఈ సంకోచవ్యాకోచ వ్యవధి ఖచ్చితంగా తెలిస్తే యీ సూర్యుని నిర్మాణం గురించి మరింత వివరమైన సమాచారం లభిస్తుంది. అప్పుడది సజాతి ప్లాజ్మా మండలమా, లేక దానిలో దళసరి శిలాఖండం లాంటి దేదైనా వుందా అనే విషయం మనకు తెలుస్తుంది.

అలాంటిది వుంటేనే హీలియం, హైడ్రోజన్ కేంద్రకాలు సమ్మిశ్రణపొంది శక్తి వుద్భవించే వీలుంది అది లేకపోతే సౌరశక్తికి మూలమేమిటనే ప్రశ్న మిగులుతుంది.

అకాడమీషియన్ సెవెర్నీ, ఆయన సహచరులూ కలిసి సేకరించిన లెక్కలను ఆధారం చేసుకొని యీ నక్షత్రం 2 గంటల 40 నిముషాల కొకసారి సంకోచ వ్యాకోచాలు పొందుతూ వుందని నిర్ధారణ చేయటం జరిగింది దీన్నిబట్టి సూర్యుడు ఒక సజాతి నిర్మాణమయి వుండగల అవకాశం ఎంతయినా వుంటుంది. క్రిమియా గ్రహవేధశాలలోని భారీ సౌర దూరదర్శినిని ఉపయోగించి పరిశోధనలు జరిపి యీ కాలాన్ని నిర్ధారణ చేశారు సున్నితమైన యీ పరికరం సాయంతో సూర్యుణ్ణి 150 మిలియన్ కిలోమీటర్ల దూరం నుంచి పరిశీలించి, సెకనుకు రమారమి 50 మీటర్ల లెక్కన సూర్యోపరితలం మీద సాగుతున్న మార్పులను కొలవటం జరిగింది ఈ మార్పుల పర్యవసానమే సూర్యకాంతిలోని హెచ్చు తగ్గులని కనుగొన్నారు సోవియట్ ఖగోళ శాస్త్రవేత్తలు జరిపిన యీ ప్రయోగం ప్రపంచ శాస్త్రజ్ఞుల దృష్టిని ఆకట్టుకొంది వారు తమ సోవియట్ సహచరుల ప్రయోగ ఫలితాలను క్షుణ్ణంగా వివేచన చేశారు క్రిమియా గ్రహవేధశాలలోని శాస్త్రజ్ఞులూ, సౌర సంకోచ వ్యాకోచాలను తాము కూడా పరిశీలించిన స్టాన్‌ఫోర్డు సౌర గ్రహవేధశాలలోని వారూ కలిసి సంయుక్తంగా ఒక పరిశోధనా పత్రాన్ని సిద్ధం చేశారు సౌర సంకోచ వ్యాకోచాలు వస్తుగతా వాస్తవమని వారు యీ పత్రంలో ముక్తకంఠంతో నిర్ధారణ చేశారు

ఈ సంకోచ వ్యాకోచాలే, సౌర థర్మో న్యూక్లియర్ శక్తికి మూలమా అనే చర్చ యిప్పుడు ముమ్మరంగా సాగుతూ వుంది ఏది ఏమైనా ఈ సౌర సంకోచ వ్యాకోచాల గురించిన సమాచారం, సౌర మండల అధ్యయనానికి గొప్ప దోహదం కూర్చిందనటంలో ఎలాంటి సందేహం లేదు ✪

---

"అవును. పి అండ్ టి లో క్లర్కును" అబద్ధమాడలేకపోయాను.

"పాపం వాళ్ళు చూడండి! జీవితం మీద ఆశ చచ్చిపోయినట్లు నిరుత్సాహంతో, నీరసంగా ఉన్నారు. అబద్ధాలయినా చెప్పి వాళ్ళ బ్రతుకులకు కాస్త తీపి రుచి చూపించాలనిపించింది"

వాళ్ళనుద్దేశించే అన్నాడని అర్థమయింది కాని, అబద్ధాలేవిటా అనుకున్నాను అతనికి నా అనుమానం అర్థమైనట్లుంది సన్నగ నవ్వి అన్నాడు.

"నిజానికి నేను ఇంజనీర్ని కాను బి ఏ కష్టపడి అయిదేళ్ళలో పూర్తిచేశాను ఇంత వరకూ జాబ్ దొరకలేదు రేపు ఇంటర్వ్యూ. ఫ్రెండ్ షర్టూ, ప్యాంటూ లాక్కుని తొడుక్కుని రాక తప్పలేదు కాని చూడండి ఒక ఇంజనీరు తమను పరిచయం చేసుకుని తమ అందాన్ని పొగిడేటంటే పుట్టే ఆనందం ఒక బికారి పొగిడితే వస్తుందంటారా?"

నేను రాదనకముందే అతను మళ్ళీ మొదలెట్టేడు

"నిజానికి అదృష్టమంటే మీదండీ! సెంట్రల్ గవర్నమెంటు జాబు దొరికిందీ అంటే ఇక నిశ్చింతేగద!"

నేను పైకి ఇబ్బందిగా మొహంపెట్టినా లోలోపల సంతోషపడిపోయాను ఆకాశాన నల్లటి మబ్బు తొలగినట్లయింది. అతనిమీదవున్న కోపం, అసూయ కరిగిపోయాయి ఇతనికంటే నేనే నయం అన్నమాట నా మొహంలోకి క్రొత్త నెత్తురు

## ఆలంబన

తెప్పించింది ఉత్సాహంగా.

అతను మళ్ళీ టాపిక్ అటు తిప్పాడు

"ఆ అమ్మాయిలు చూడండి! వాళ్లకే కలలూ ఆశలూ కూడా లేనట్లుంది. ఇలాంటి సంఘటన ఏదో జరిగాక మళ్లీ అది ఆలంబనగా ఎవరో ఇలాగే పలకరించి, ప్రేమించి పెళ్లి చేసేసుకుంటారని కొన్నాళ్ళు కలలుఅల్లుకుంటారు తమ అందంమీద తమకు నమ్మకం పెరుగుతుంది ఈ మధ్యతరగతి అమ్మాయి అలా ఏడవడం తప్పదని జీవితాన్ని నిస్సారంగా చేసుకోవడం ఏం బాగుంటుంది చెప్పండి! ఈ కొద్దికాలపు జీవితాన్నీ అన్యాయంగా ఏడుస్తూ వేస్టు చేసుకోవడం నాకు నచ్చదు. మీరు సంతోషంగా వుంటేకద ఎదుటివాళ్లను సంతోషంగా వుంచేది!"

అవునన్నట్లు తలూపేను

"కట్నం ఇవ్వలేకే ఇద్దరూ పెళ్ళిళ్ళు మానేసుకుని, బి ఇడి ట్రెయినింగు తీసుకుంటున్నారట! ఏదో జాబ్‌లో దూరితే ఎవరో ఒకరు కట్టుకోకపోరు వాళ్లని! అదే చెప్పేను వాళ్లతో. మనమేదో కొన్ని మాటలు చెప్తే ఎదుటివాడు సంతోషపడతాడంటే మనం సంతోషంగా అబద్ధాలాడేయొచ్చు!" అని ఆగి మళ్లీ అన్నాడు

"క్రొత్త పరిచయాలు టానిక్‌ల్లాంటివి మామూలుగా గడిచిపోయే జీవితంలో కాస్త తృప్తినీ, పరిమళాన్నీ నింపుతాయి, అని ఎవరో కవి అన్న గుర్తు."

తర్వాత అతనే గడిచిన రెండేళ్ళ భారతదేశ చరిత్రలో ఒక్కో అంశాన్నీ తీసుకుని దాన్ని వివరించి, తన అభిప్రాయాలు జోడించాడు మధ్య మధ్య చిన్న చిన్న పొడిమాటలు తప్ప నేనేమి మాట్లాడుకున్నా, రవ్వంత హాస్యం మిళితం చేసిన అతని మాటలు బోర్ కొట్టలేదు

డోర్నకల్‌లో ఎక్కిన ఒక ఫామిలీ అంటే ఓ భర్త, భార్య, ఇద్దరు చిన్న మగపిల్లలు మా ఎదుటి సీట్లో కూర్చున్నారు

అతను మళ్ళీ తెలుగు సినిమాల గురించి కాసేపు బాధపడి, ఈమధ్య సినిమాలు చూడడానికి తన దగ్గర డబ్బు లేనందుకు ఆనందించేడు ఇంతలో వరంగల్ వచ్చింది

"వస్తానండీ ఇక" అంటూ లేచాడు

"విష్ యూ బెస్టాఫ్ లక్" మనస్ఫూర్తిగానే అన్నాను

ఎక్స్‌ప్రెస్ బయల్దేరిన కొద్దిసేపటిగ్గాని, అతని సీట్లో పడివున్న చిన్న కార్డుముక్కని చూడలేదు

టి వెంకటాచలం, ఎమ్ టెక్, సివిల్ ఇంజనీర్ అని ప్రింట్ వున్న విజిటింగ్ కార్డు అది క్రింద ఇంటి నెంబరూ, ఫోన్ నెంబరూ వున్నాయి పొరపాటున జారిపడి వుండొచ్చు

అది చూసి ఆశ్చర్యపోయాను ఆలోచించాను. కళ్ళు కొద్దిగా చెమర్చాయి ముక్కూ మొహం తెలీని మనిషి తృప్తికి అతనాడిన నాటకం అర్థమయింది మిగిలివున్న మానవత్వాని కాలంబన మతను

ముందుకు వంగి ముందు సీట్లో వున్నాయన్ని అడిగేను నవ్వుతూ "మీరెక్కడిదాకా?" ●